

సోమశిలలో 7.99 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 7.992 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 210 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,730
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,603
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,801
సవర (8 గ్రాములు)	రూ.54,408



బైక్‌ను ఢీకొన్న లారీ

బైక్‌ను లారీ ఢీకొనడంతో యువకుడు మృతి చెందారు. ఆత్మకూరు సమీపంలోని నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై ఘటన చోటుచేసుకుంది.

8లో

న్యూస్‌రీల్

కౌంటింగ్ కేంద్రంలో పరిశీలన



నెల్లూరు(దర్గామిట్ట): కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌ను బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈవీఎంలను భద్రపర్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించాలని ఆదేశించారు. నెల్లూరు సిటీ ఆర్వో, కమిషనర్ వికాస్ మర్మత్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీఓ మలోల, నెల్లూరు నగర, రూరల్ తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(అర్బన్): ఈ విద్యాసంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా కన్వీనర్, ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన వారు గురువారం నుంచి జూన్ 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకొని వారికి కేటాయించిన సంఖ్యను గుర్తుంచుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వారికి సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఈ నెల 10 నుంచి వచ్చే నెల పది వరకు తమ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను చేయించుకోవాలని సూచించారు. కౌన్సెలింగ్ తేదీలను మెసేజ్ రూపంలో తెలియజేయనున్నామన్నారు. వివరాలకు వెంకటేశ్వరపురంలోని బాలుర ఐటీఐ కళాశాలను సంప్రదించాలని సూచించారు.

జిల్లాకు ట్రెయినీ ఐపీఎస్‌లు

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు 163 మంది ట్రెయినీ ఐపీఎస్‌లను రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు కేటాయించారు. ఈ క్రమంలో జిల్లాకు మయాంక్ మిశ్రా, సిద్ధార్థ్ రామ్‌కుమార్, ప్రతీక్ సింగ్, ఖుష్మిశ్రా, సూరజ్, అభినవ్ ద్వివేది, జామాసోనర్, అషిమా వశ్వాణి, అపర్ణను కేటాయించారు. వీరందరూ జిల్లాకు బుధవారం చేరుకున్నారు. ఎన్నికల నిర్వహణ, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చేపడుతున్న చర్యలను ఎస్పీ పర్యవేక్షణలో వీరు తెలుసుకోనున్నారు. ఎన్నికలు ముగిసేంత వరకూ వీరు ఇక్కడే ఉండనున్నారు.

సమాజ సేవకు అంకితమవుదాం



రక్తదానం చేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

నెల్లూరు(అర్బన్): క్షతగాత్రులు, ప్రకృతి వైపరీత్యాల్లో తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నవారికి స్వచ్ఛందంగా సేవలందిస్తూ.. సమాజ అభివృద్ధికి అంకితమవుదామని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సెక్రటరీ మస్తానయ్య పేర్కొన్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో పలువురు సభ్యులు బుధవారం రక్తదానం చేశారు. తొలుత ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని నిర్వహించారు. హెన్రీడ్యూనాట్ చిత్రపటానికి నివాళులర్పించారు. తలసేమియా రోగులకు ఆటపాటలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు, ఎమ్సీ మెంబర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్లు సీత, హరిత, రమ్య తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రుడి రచనలు మధురమైనవి

నెల్లూరు(బృందావనం): రవీంద్రుడి రచనల్లో బాలల ప్రపంచం ఎంతో మధురంగా ఉంటుందని ప్రముఖ రచయిత్రి డాక్టర్ చంద్రలత పేర్కొన్నారు. నగరంలోని పురమందిరంలో రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సభను బుధవారం నిర్వహించారు. అడ్వొకేట్, రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సభ పోషక వ్యవస్థాపకుడు రమణారెడ్డి స్మృత్యర్థం నెల్లూరు వర్ధమాన సమాజ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గాయని చేజర్ల వినయ, గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకురాలు లక్ష్మీసుహాసిని, బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి, శ్రీనివాసులురెడ్డి, వర్ధమాన సమాజ కార్యదర్శి మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉదయగిరీశుడెవరో..!

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డికే మెండుగా విజయావకాశాలు

- ఆది నుంచి ఈ కుటుంబానికే పట్టు
- ఈ దఫా ఫ్యాన్ హవానేనంటున్న విశ్లేషకులు
- నియోజకవర్గ ఆవిర్భావం నుంచి రెండుసార్లే టీడీపీ విజయం
- మిగిలిన అన్ని సార్లు ఇతర పార్టీలకే జై
- ఈ సారి బరిలో ఇద్దరూ కొత్తవారే

జిల్లాలో ఉదయగిరి నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. ఎనిమిది మండలాలతో అతి పెద్ద వైశాల్యం గల ప్రాంతంగా పేరు గడించింది. విలక్షణ తీర్పునివ్వడం ఇక్కడి ప్రజల ప్రత్యేకత. గడిచిన ఆరు ఎన్నికల సరళిని పరిశీలిస్తే ఇక్కడి ఓటర్లు ఎక్కువగా మేకపాటి కుటుంబం వైపే మొగ్గు చూపారు. నాటి నుంచి 2019 ఎన్నికల వరకు కేవలం రెండుసార్లే టీడీపీ విజయం సాధించింది. ఈ క్రమంలో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ, అభివృద్ధి పాలన.. మేకపాటి కుటుంబానికి ఉన్న ఆదరణతో ఈ ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే విజయమనే సంకేతాలు వెలువడుతున్నాయి.





ఉదయగిరి: ఈ ఎన్నికల్లోనూ ఉదయగిరిధారణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి దక్కే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. సమర్థ పాలన.. పేదల ఆర్థికాభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు.. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి చర్యలు.. పదవుల్లో బడుగు, బలహీనవర్గాలకు పెద్దపీట.. ఇలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనను సాగించారు. మరోవైపు ఉదయగిరి నియోజకవర్గంలో 40 ఏళ్లుగా మేకపాటి కుటుంబానికి పట్టుంది. పై రెండు కారణాలతో ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డికే విజయం వరించే అవకాశాలు మెండుగా మారాయి.

సైకిల్‌కు అన్నీ మైనస్సులే..

ఉదయగిరిలో టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న కాకర్ల సురేష్ ఎన్నారై. రాజకీయ అనుభవలేమి.. పార్టీ నేతల మధ్య కొరవడిన సఖ్యత.. చంద్రబాబు మాటలను ప్రజలు విశ్వసించకపోవడం.. గ్రూపు తగాదాలు.. వెరసి కాకర్లకు మైనస్సుగా మారాయి. కేవలం డబ్బునే నమ్ముకొని విజయ తీరాలకు చేరాలని ఆయన చేస్తున్న యత్నాలు ఫలించేలా కనిపించడంలేదు. కాకర్ల ట్రస్ట్ పేరిట కొన్ని కార్యక్రమాలను చేపట్టినా.. టికెట్ వచ్చేంత వరకు ప్రజలతో సత్సంబంధాల్లేకపోవడం ఆయనకు ఇబ్బందికరంగా పరిణమించింది. టీడీపీ టికెట్ ఖరారయ్యాక సైతం ప్రజల్లో తిరిగేందుకు తగిన సమయం లేకపోవడంతో సుడిగాలి పర్యటనలకే పరిమితమయ్యారు.

మేకపాటి కుటుంబానికి సడలని పట్టు

ఉదయగిరి రాజకీయ ముఖచిత్రంలో మేకపాటి కుటుంబానికి దీర్ఘకాలంగా మంచి పట్టుంది. మేకపాటి కుటుంబానికి చెందిన రాజమోహన్‌రెడ్డి 1982లో రాజకీయ ప్రవేశం చేశారు. నాటి నుంచి నేటి వరకు ఉదయగిరి ప్రజల్లో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వ్యక్తిగత సంబంధాలు కలిగి ఉన్నారు. 1985లో కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా ఈయన గెలుపొందారు. తదుపరి 2004, 2009లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం అనంతరం తన ఎమ్మెల్యే పదవి, కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన ఆయన 2012 ఉప ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై పోటీ చేసి ఘన విజయం సాధించారు. అనంతరం 2019 ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. గెలుపోటములతో సంబంధం లేకుండా ఉదయగిరి ప్రజలతో నిత్యం సత్సంబంధాలను కొనసాగిస్తుండటంతో మేకపాటి కుటుంబీకులు మన్ననలను పొందగలిగారు.

16 ఎన్నికల్లో రెండు సార్లే..

1955లో ఉదయగిరి నియోజకవర్గం ఆవిర్భవించింది. ఇప్పటి వరకు 16 సార్లు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఒకసారి జనతా పార్టీ, మరోసారి బీజేపీ, రెండుసార్లు స్వతంత్రులు, రెండుసార్లు టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. మిగిలిన అన్నిసార్లు కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీకే విజయాలే దక్కాయి. 1999లో కంభం విజయరామిరెడ్డి.. 2014లో బొల్లినేని వెంకటరామారావు స్వల్ప మెజార్టీతో టీడీపీ తరఫున విజయం సాధించారు. దీన్ని బట్టి వైఎస్సార్‌సీపీ విజయం నల్లేరుపై నడకేననే సంకేతాలు వెలువడుతున్నాయి.

నిరంతరం మమేకం

తొమ్మిది నెలలుగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి నిత్యం ప్రజల్లో ఉంటూ నియోజకవర్గంలోని ప్రతి ఊరు, గడపకూ వెళ్లి సీఎం జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. తమ పార్టీకి అండగా ఉండాలంటూ విస్తృత ప్రచారం చేయడం.. ప్రజలతో మమేకమవ్వడం ఆయనకు కలిసొచ్చే అంశం.

ఫ్యాన్‌కే జై..

ఉదయగిరి బరిలో రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులూ కొత్తవారే కావడం విశేషం. అయితే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి కుటుంబ బలం, ప్రజల్లో ఆదరణ ఎక్కువగా ఉండటంతో విజయావకాశాలు ఆయనకే మెండుగా కనిపిస్తున్నాయి. 20 ఏళ్లుగా జరిగిన సార్వత్రిక ఎన్నికలను పరిశీలిస్తే నియోజకవర్గంలోని ఉదయగిరి, వింజమూరు, జలదంకి, కలిగిరి మండలాలు టీడీపీయేతర పార్టీలకే అనుకూలంగా ఫలితాలిస్తున్నాయి. ప్రస్తుతం ఈ నాలుగు మండలాలతో పాటు సీతారామపురంలోనూ వైఎస్సార్‌సీపీకే స్పష్టమైన ఆధిక్యత కనిపిస్తోంది. కొండాపురం, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లో హోరాహోరీ తప్పేలా లేదు. ఉదయగిరి కోటలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

టీడీపీకి వరుస షాకులు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మధుసూదన్‌యాదవ్

కందుకూరు: ఎన్నికలు సమీపించే కొద్దీ టీడీపీకి వరుస షాకులు తగులుతున్నాయి. ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు వరుసగా గుడ్‌బై చెప్పి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. తాజాగా టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, నెల్లూరు పార్లమెంట్ ఇన్‌చార్జి చెన్నారెడ్డి వెంకటరమణ, తెలుగు మహిళా జిల్లా నాయకురాలు చెన్నారెడ్డి సరసమ్మ టీడీపీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరారు. బుడగ జంగాల నియోజకవర్గ నేత లక్కే మాల్యాద్రి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి కండువాలు కప్పి పార్టీ కందుకూరు అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ సాదరంగా ఆహ్వానించారు. వీరితో పాటు చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, చెన్నారెడ్డి విజయమ్మ, మాలకొండయ్య, మాల్యాద్రి, యలమంద, నంబూరు వెంకయ్య, మరో 40 కుటుంబాలు పార్టీలో చేరాయి.

వైఎస్సార్‌సీపీతోనే ప్రజలు

- అభివృద్ధిలో కావలి నియోజకవర్గం పరుగులు
- యువతకు భారీ సంఖ్యలో ఉద్యోగావకాశాలు
- ప్రతిపక్షాలను పట్టించుకోని ప్రజలు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో రామిరెడ్డి



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంటే ప్రజలు ఉన్నారని పార్టీ కావలి నియోజకవర్గ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సాక్షి బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, రామాయపట్నం పోర్టుతో కావలి అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందని చెప్పారు. రానున్న రోజుల్లో యువతకు ఉద్యోగావకాశాలను కల్పించనున్నామని వెల్లడించారు. ప్రతిపక్షాల అసత్యాలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని ఆయన స్పష్టం చేశారు.

10లో

పోలింగ్‌కు పూర్తిస్థాయిలో సన్నద్ధం

- పొరపాట్లకు తావులేకుండా అన్ని ఏర్పాట్లు
- కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఈ నెల 13న నిర్వహించనున్న పోలింగ్‌కు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. పోలింగ్ ఏర్పాట్లపై కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను బుధవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పోలింగ్‌ను సజావుగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని తీసుకెళ్లేందుకు గానూ ఈ నెల 12వ తేదీ ఉదయం ఆరు గంటలకు 255 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామని చెప్పారు. ఎంపిక చేసిన రూట్‌మ్యాప్ మేరకే బస్సులను నడపాలని సూచించారు.

జీపీఎస్ ఉన్న వాహనాల్లోనే ఈవీఎంలు

జీపీఎస్ ఉన్న వాహనాల్లోనే ఈవీఎంలను తరలించాలని కలెక్టర్ సూచించారు. ఇబ్బందులు తలెత్తకుండా రిజర్వ్‌లో మరిన్ని వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. 85 ఏళ్లుపైబడిన వృద్ధులు, దివ్యాంగుల కోసం ఆటోలను ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులెవరూ ఈ నెల 11వ తేదీ సాయంత్రం ఆరు తర్వాత జిల్లాలో ఉండకూడదని స్పష్టం చేశారు. అన్ని లాడ్జీల్లో తనిఖీలను చేపట్టాలని సూచించారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, జనాలు గుమికూడొద్దని కోరారు. మీడియా ధ్రువీకరణ పత్రాలున్న వారినే పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలని, ఒకేసారి ఎక్కువ మందిని కాకుండా పరిమితి మేరకే పంపాలని సూచించారు. ఓటింగ్ కంపార్ట్‌మెంట్ వద్ద వీడియో చిత్రీకరణ, ఫొటోలకు అనుమతిలేదని తెలిపారు.

ఫిర్యాదులొస్తే వెంటనే స్పందించాలి

నిబంధనల అతిక్రమణపై ఏమైనా ఫిర్యాదులొస్తే వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని, విచారణ అనంతరమే సమాచార శాఖ ద్వారా పూర్తిస్థాయి ప్రకటన ఇవ్వాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులపై ఏమైనా కేసులుంటే, ఆ సమాచారాన్ని పత్రికల ద్వారా ప్రచురించాలని, ఇప్పటికీ ప్రచురించని అభ్యర్థులకు నోటీసులను జారీ చేయాలని ఆర్వోలను ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన అన్ని నివేదికలను అభ్యర్థులు త్వరితగతిన అందజేయాలని కోరారు.

పూర్తి స్థాయిలో వసతులు

పోలింగ్ కేంద్రాల్లో కుర్చీలు, టెంట్లు, మంచినీటి సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. దివ్యాంగులు, వయోవృద్ధులకు ఇబ్బందుల్లేకుండా వీల్ చైర్లను ఏర్పాటు చేయాలన్నారు. రెండు యూత్.. రెండు వృద్ధులు.. రెండు మోడల్ పోలింగ్ కేంద్రాలను ప్రతి నియోజకవర్గంలో సుందరంగా ముస్తాబు చేయాలన్నారు. ఓటరు స్లిప్పులను త్వరగా పంపిణీ చేయాలని సూచించారు. డీఆర్వో లవన్న, ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా, నోడల్ అధికారులు బాపిరెడ్డి, సాల్మన్‌రాజు, చందర్, పద్మావతి, కన్నమనాయుడు, రాజశేఖర్, సదారావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 65 మంది గైర్హాజరు

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షలకు 65 మంది గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారిణి మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో, ఆరో సెమిస్టర్ పరీక్షలకు 688 మందికి గానూ 645 మంది హాజరయ్యారని చెప్పారు. మధ్యాహ్నం నిర్వహించిన నాలుగో సెమిస్టర్ పరీక్షకు 363 మందికి గానూ 22 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

పాలిసెట్ ఫలితాల విడుదల

నెల్లూరు(అర్బన్): పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ సాంకేతిక కోర్సుల్లో ప్రవేశానికి గత నెల్లో నిర్వహించిన పాలిసెట్ ఫలితాలను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. నెల్లూరు, కావలి, ఆత్మకూరులోని ఎనిమిది కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 3325 మంది దరఖాస్తు చేసుకోగా, 2995 మంది ఉత్తీర్ణత సాధించారు. 90.08 శాతంగా ఉత్తీర్ణత నమోదైందని పాలిసెట్ జిల్లా కన్వీనర్ విజయకుమార్ తెలిపారు. నగరానికి చెందిన మునిసాయి ప్రీతమ్ 160, సాయికిరణ్ 177, సాయిసాత్విక్ 183 ర్యాంకులను సాధించారు.

ఐఐటీ చదవాలన్నదే ధ్యేయం



నన్ను తల్లిదండ్రులు కష్టపడి చదివించారు. 160వ ర్యాంక్‌ను సాధించడం ఆనందంగా ఉంది. ఇదే స్ఫూర్తితో కష్టపడి ఐఐటీ చదవాలన్నదే నా ధ్యేయం.

– మునిసాయి ప్రీతమ్, నెల్లూరు

నూతన ఆవిష్కరణలకు కృషి



పాలిసెట్‌లో మంచి ర్యాంక్‌ను సాధించడం సంతోషంగా ఉంది. బాగా కష్టపడి చదివి ఐఐటీలో సీటు సాధిస్తా. నూతన ఆవిష్కరణలు చేసి సమాజానికి ఉపయోగపడాలనేదే నా ఆశయం.

– సాయిసాత్విక్, నెల్లూరు

మట్టి తవ్వకం.. వెంచర్లకు పంపకం

ప్రకృతి వనరులను కొల్లగొడుతూ కొందరు భూబకాసురులు రాజ్యమేలుతున్నారు. దోపిడీకి కాదేదీ అనర్హమనే రీతిలో చెలరేగిపోతూ మైపాడు చెరువులో కోట్లాది రూపాయల విలువజేసే మట్టిని మింగేశారు. దీన్ని రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలించి భారీగా సొమ్ము చేసుకున్నారు. బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారి భూములను లక్ష్యంగా చేసుకొని ఈ దమనకాండకు తెరదీశారు. ఊళ్లో పెద్ద మనిషిగా చెలమణీ అయ్యే కల్యాణ్‌రెడ్డి కనుసన్నల్లో ఈ అక్రమాలు అడ్డూఅదుపులేకుండా సాగాయి.

- మైపాడులో భూబకాసురుడు
- కల్యాణ్‌రెడ్డి కనుసన్నల్లో భారీగా అక్రమాలు
- పరిమితుల్లేకుండా చెరువులో యథేచ్ఛగా తవ్వకాలు
- రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయం
- బడుగు, బలహీనవర్గాల భూముల్లో దౌర్జన్యం



భారీగా గుంతలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మైపాడులో కోట్లాది రూపాయల విలువజేసే మట్టిని కొల్లగొట్టేందుకు స్కెచ్ వేసిన భూబకాసురుడు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి.. దాన్ని చేజిక్కించుకోవడంలో సఫలీకృతులయ్యారు. పేరుకు ఇరిగేషన్, రెవెన్యూ నుంచి అనుమతులు పొంది.. పరిమితులను పక్కనబెట్టి యంత్రాల సాయంతో రాత్రీ, పగలనే తేడా లేకుండా ఇష్టానుసారంగా మట్టిని తవ్వించారు. ఆపై తీర ప్రాంతంలోని రియల్ ఎస్టేట్ వెంచెర్లకు వీటిని విక్రయించి భారీగా సంపాదించారు.

అనుకూలంగా మార్చుకొని..

వాస్తవానికి మైపాడు చెరువు నుంచి మైపాడు, కొరుటూరు తదితర గ్రామాల్లోని పొలాలకు సాగునీరందుతోంది. దీంతో ఈ చెరువులో మట్టిని తవ్వి మరమ్మతులు చేపడితే నీటి నిల్వతో భూగర్భ జలాలు పెరిగేందుకు అవకాశం ఉంటుంది. ఈ తరుణంలో తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. నిబంధనల మేరకు తవ్విన మట్టిని రైతుల అవసరాలకే వినియోగించుకోవాలి. అయితే దీన్ని తనకు అనుకూలంగా మార్చుకొని మైపాడుకు చెందిన దువ్వూరు కల్యాణ్‌రెడ్డి భారీగా వెనుకేసుకున్నారు. ఇలా దాదాపు రూ.రెండు కోట్లకుపైగా అక్రమంగా సంపాదించారు.

ఆయకట్టును దృష్టిలో ఉంచుకొని ఈ తవ్వకాలను చేపట్టాల్సి ఉంది. అయితే దీనికి విరుద్ధంగా భారీగా చేపట్టారు. చెరువు నుంచి బయటకు తీసుకెళ్లడం సులభంగా ఉండటంతో వీరి ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండాపోయింది. ఈ క్రమంలో 30, 40 అడుగుల లోతులో భారీ గుంతలు ఏర్పడ్డాయి. చెరువులో పాడి రైతులు పశువులను మేపుతుంటారు. ఈ తరుణంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

రియల్ ఎస్టేట్ వెంచర్‌కు దారి

పంచాయతీ పరిధిలోని సుమారు 20 ఎకరాల్లో లేఅవుట్‌ను వేశారు. ప్రధాన రహదారి నుంచి ఈ లేఅవుట్‌కు వెళ్లాలంటే ఎనిమిది అడుగుల దారి మాత్రమే ఉంది. దీంతో కల్యాణ్‌రెడ్డిని సదరు యజమానులు కలిసి నగదును ముట్టజెప్పడంతో సుమారు 40 అడుగుల మేర దారిని లేఅవుట్‌కు కల్పించారు. శివాలయ భూమిలో ఈ దారిని ఏర్పాటు చేసినా చైర్మన్ కనుపూరు సురేంద్ర నోరు మెదపలేదు. ఆయనకూ నగదును ముట్టజెప్పారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మట్టిని అమ్ముకొని డబ్బును సంపాదించడంపైనే దృష్టి పెట్టిన కల్యాణ్‌రెడ్డి.. గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టలేదని స్థానికులు పేర్కొంటున్నారు.

బెదిరించి.. ఆపై ఆక్రమించి

చెరువులో కొద్దిపాటి పొలంలో నిరుపేదలు వ్యవసాయం చేసుకొని కాలం గడుపుతుంటారు. అయితే వీరిని లక్ష్యంగా చేసుకొని దౌర్జన్యంగా పొలాలను అక్రమంచి లోతుగా తవ్వేశారు. దీనిపై ప్రశ్నిస్తే కల్యాణ్‌రెడ్డి అనుచరులు దౌర్జన్యానికి తెగబడుతున్నారు. ఊళ్లో పెద్ద మనిషి కావడంతో ఎదురు మాట్లాడలేకపోతున్నారు. తమ పొట్టగొట్టొద్దని కోరినా ఆయన కనికరించడంలేదు. ఈ చెరువు మట్టిని కల్యాణ్‌రెడ్డి అనుచరుడు, మత్స్యకార నేత నరసింహ తమ అవసరాలకు తరలించారు.

అండగా ఉన్నాం.. మరో అవకాశమివ్వండి

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ఎన్నికల ప్రచారం చేస్తున్న కాకాణి, గురుమూర్తి

మనుబోలు: 'ఐదేళ్లపాటు పేదలకు అండగా నిలిచా.. రాష్ట్ర బంగారు భవిష్యత్‌ కోసం మరోసారి వైఎస్సార్‌సీపీకి అవకాశం ఇవ్వండి' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రమైన మనుబోలులో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సభలో మాట్లాడుతూ మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకుని అధికారంలోకి రావడం ఆపై ప్రజలను వంచించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యన్నారు. సూపర్‌ సిక్స్‌ అంటూ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యాడన్నారు. పింఛన్లు అందకుండా వృద్ధులు, దివ్యాంగులను హింసించిన పాపం బాబును వెంటాడుతుందన్నారు. ఈ ప్రభుత్వంలో రైతులకు సకాలంలో సాగునీరు అందించామన్నారు. వారికి అవసరమైన పనిముట్లు, ఎరువులు, విత్తనాలను ఆర్బీకేల ద్వారా సకాలంలో ఇచ్చామన్నారు. రాష్ట్ర ప్రజల బాగు కోసం సీఎం జగన్‌ వందలసార్లు బటన్లు నొక్కాడని, ఇప్పుడు ఎమ్మెల్యేగా తనను, తిరుపతి ఎంపీగా గురుమూర్తిని గెలిపించేందుకు రెండు బటన్లు నొక్కాలని ఓటర్లను కోరారు.

అభివృద్ధి చేశాం

గురుమూర్తి మాట్లాడుతూ జగనన్న నాయకత్వంలో కేంద్రం నుంచి ఈ ఐదేళ్లలో నిధులు తెప్పించి తిరుపతి పార్లమెంట్‌ పరిధిలో అభివృద్ధి పనులు చేశానన్నారు. ఉప ఎన్నికల్లో సర్వేపల్లిలో తనకు అత్యధిక మెజారిటీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు చిట్టమూరు అనితమ్మ, సర్పంచ్‌ కంచి పద్మమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరమ్మ, సేవానాథం ట్రస్ట్‌ ఫౌండర్‌ మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి, నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, చిట్టమూరు అజయ్‌రెడ్డి, ముంగర రవీందర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్‌, ఏడెం మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్‌ను శ్రీధర్‌రెడ్డి అభివృద్ధి చేయలేదు

• వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: '2014 నుంచి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నెల్లూరు రూరల్‌ ఎమ్మెల్యేగా ఉన్నారు. నియోజకవర్గంలో ఆయన చేసిన అభివృద్ధి శూన్యం. అందుకే నాపై ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తున్నాడు. దౌర్జన్యాలు చేసే శ్రీధర్‌రెడ్డి కావాలా? అభివృద్ధి చేసే నేను కావాలా?.. ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి' అని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్‌ నియోజకవర్గ పరిధిలోని 36వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్‌ పిండి శాంతి, డివిజన్‌ ఇన్‌చార్జి పిండి సురేష్‌ తదితరులతో కలిసి బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు ఒక్క అవకాశం ఇస్తే వందల కోట్ల రూపాయలు తెచ్చి రూరల్‌ను రాష్ట్రంలోనే నంబర్‌ వన్‌గా తీర్చిదిద్ది చూపిస్తానన్నారు. కార్యక్రమంలో మేయర్‌ స్రవంతి, ఆంధ్రా క్రికెట్‌ అసోసియేషన్‌ జూనియర్‌ సెలక్షన్‌ కమిటీ సభ్యుడు మలిరెడ్డి కోటారెడ్డి, రాష్ట్ర సేవాదళ్‌ అధ్యక్షుడు మాశెం సుధీర్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు మల్లు సుధాకర్‌రెడ్డి, నాయకులు లంకా రామశివారెడ్డి, సీహెచ్‌ హరిబాబు యాదవ్‌, ఏసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఓడిపోవడం ఖాయం

• వైఎస్సార్‌సీపీ ఉదయగిరి అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి



అన్నవరంలో ప్రచారం చేస్తున్న రాజగోపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి

జలదంకి: 'ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టిస్తుంది. టీడీపీ ఓడిపోవడం ఖాయం' అని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి అసెంబ్లీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోపన్నపాళెం, అన్నవరం, కొత్తపాళెం, జలదంకి, సోమవరప్పాడు, కమ్మవారిపాళెం, బ్రాహ్మణక్రాక పంచాయతీల్లో బుధవారం కావలి మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌ ఇచ్చిన మాటకు కట్టుబడి కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలు అందించారన్నారు. చంద్రబాబు మాత్రం మోసం చేయడంలో దిట్ట అన్నారు. అలాంటి వ్యక్తికి అధికారం ఇస్తే నట్టేట ముంచేస్తాడన్నారు. పేదలకు మరింత మేలు చేసేలా జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను ప్రకటించారన్నారు. మేం గెలిస్తే జగన్‌ అంతు చూస్తామని చంద్రబాబు, పవన్‌ కళ్యాణ్‌ అంటున్నారని, ప్రజలకు ఏమి చేస్తారో చెప్పడం లేదన్నారు. కాటంరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌ ఐదేళ్ల పాలన స్వర్ణయుగంలా సాగిందన్నారు. పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్‌ కేతిరెడ్డి రవీంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వంటేరు రామచంద్రారెడ్డి, నాయకులు చేవూరు శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని సతీష్‌నాయుడు, గొట్టిపాటి శ్యామ్‌ సుందరనాయుడు, రావి ప్రసాద్‌నాయుడు, ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, తిప్పారెడ్డి ఇందిరమ్మ, సురె వెంకటశేషారెడ్డి, కోర్శిపాటి రామిరెడ్డి, గండు వెంకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ అంటేనే చంద్రబాబు, పవన్‌కు భయం

• వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి



మాట్లాడుతున్న పెంచలరెడ్డి

నెల్లూరు(బృందావనం): 'సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అంటే చంద్రబాబు, పవన్‌ కళ్యాణ్‌కు భయం. ఎన్నికల్లో ఓటమి భయంతో ఆ ఇద్దరూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు' అని పార్టీ నెల్లూరు నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి అన్నారు. నగరంలో స్టోన్‌హౌస్‌పేట రేబాలవారి వీధిలో ఉన్న తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు సూపర్‌సిక్స్‌ పేరుతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నాడన్నారు. ఆయన్ను ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. ఓటమి అంచున ఉన్న కూటమి నేతలు ల్యాండ్‌ టైట్లింగ్‌ యాక్ట్‌పై అబద్ధాలను ప్రచారం చేస్తున్నారన్నారు. నెల్లూరు పార్లమెంట్‌ స్థానానికి వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేస్తున్న వేణుంబాక విజయసాయిరెడ్డికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. జిల్లా అభివృద్ధి కోసం ఆయన ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేశారన్నారు. ప్రస్తుతం నెల్లూరు రూరల్‌ ఎమ్మెల్యేగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈ ఐదేళ్లపాటు ఎంపీగా జిల్లా ప్రగతికి ఎంతగానో కృషి చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిపై చంద్రబాబు, పవన్‌ ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తున్నారని, ఆ ఇద్దరికీ ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు.

స్వగ్రామానికి వెళ్తుండగా..

• రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



వెంకటేష్‌ (ఫైల్‌)

ఆత్మకూరు: మున్సిపల్‌ పరిధిలోని వెంకట్రావుపల్లి అడ్డరోడ్డు సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై మోటార్‌బైక్‌పై వెళ్తున్న యువకుడిని ఎదురు నుంచి లారీ ఢీకొనడంతో మృతిచెందిన ఘటన బుధవారం సాయంత్రం జరిగింది. ఎస్సై ముత్యాలరావు కథనం మేరకు.. అనంతసాగరం మండలం దేవరాయపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్‌ (24) సొంత పని నిమిత్తం బైక్‌పై ఆత్మకూరుకు వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం సమీపంలోని వారు నెల్లూరుకు తరలిస్తుండగా మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కాగా వెంకటేష్‌ తండ్రి కొంతకాలం క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి ఆ యువకుడు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్‌ ధరలు



బ్రాయిలర్‌ (లైవ్‌)	:157	బ్రాయిలర్‌ చికెన్‌	:274
లేయర్‌ (లైవ్‌)	:95	బ్రాయిలర్‌ స్కిన్‌లెస్‌	:304
		లేయర్‌ చికెన్‌	:162

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	:రూ.100
సన్నవి	:రూ.60
పండ్లు	:రూ.40



అబద్ధాలు చెప్పడం చంద్రబాబుకు అలవాటే

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



నాయుడుపాళెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: 'అబద్ధాలు చెప్పడం చంద్రబాబు నాయుడికి అలవాటే. ఎన్నికల నేపథ్యంలో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాడు. ఎవరూ ఆయన్ను నమ్మొద్దు' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని నాయుడుపాళెం, గౌతమ్‌నగర్‌, గండవరంలలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు రైతు, పొదుపు రుణమాఫీ చేస్తానన్నాడు. ఇంకా నిరుద్యోగులకు రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పాడు. కానీ అధికారంలోకి వచ్చాక అందర్నీ మోసం చేశాడన్నారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి బాబులా మోసకారి కాదన్నారు. దివంగత వైఎస్సార్‌ పథకాలను కొనసాగించి ప్రజల గుండెల్లో స్థానం సంపాదించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు మంచి చేస్తుంటే ఓర్వలేక అన్ని పార్టీలు ఏకమై జగన్‌ను సీఎం పదవి నుంచి దించాలని చూస్తున్నాయన్నారు. పొరపాటున కూటమి అధికారంలోకి వస్తే చంద్రబాబు సంక్షేమ పథకాలు, సచివాలయాలు, వలంటీర్‌ వ్యవస్థలను రద్దు చేసి పేదలకు అన్యాయం చేస్తాడని చెప్పారు. తాజాగా పలు పథకాల నగదు లబ్ధిదారులకు అందకుండా నిలిపి వేయించడాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. బీసీ, మైనారిటీ వర్గాలకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారని పార్టీ మారిన వేమిరెడ్డి దంపతులు పేదలకు ఏం మేలు చేస్తారో ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. జగన్‌కు పేదల ఆశీర్వాదం ఉందని తెలిపారు. గౌతమ్‌నగర్‌కు చెందిన ఓ నాయకుడిని కుటుంబసభ్యుడిలా చూసి గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేయిస్తే రూ.15 లక్షలకు అమ్ముడుబోయి టీడీపీలో చేరాడన్నారు. అలాంటి వారిని తిరిగి వైఎస్సార్‌సీపీలో చేర్చుకునేది లేదని స్పష్టం చేశారు. ఫ్యాన్‌ గుర్తుకు ఓట్లు వేసి నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్‌ చైర్మన్‌ వీరి చలపతిరావు, ఎంపీపీ జి.జ్యోతి, ఎంపీటీసీ పెనాక శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ, సచివాలయాల మండల కన్వీనర్లు గంధం వెంకటశేషయ్య, కొండా శ్రీనివాసులురెడ్డి, నాయకులు నల్లపరెడ్డి రాజేంద్రనాథ్‌రెడ్డి, మారంరెడ్డి నారసింహారెడ్డి, అడపాల మోహన్‌కృష్ణ, మాగుంట గిరిధర్‌రెడ్డి, కె.కమలాకర్‌రెడ్డి, నాగిరెడ్డి రమేష్‌, ఆర్‌.రాజేష్‌రెడ్డి, చింత చలపతి, ఎం.ప్రతాప్‌రెడ్డి, బండ్ల మోహన్‌, ఉమామహేశ్వరరావు, రాజ్‌కుమార్‌, జనార్దన్‌ పాల్గొన్నారు.

మళ్లీ గడప వద్దకే పింఛన్లు చేర్చండయ్యా

• ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిని కోరిన పెన్షన్‌దారులు



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

సోమశిల: 'సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి గడప దాటకుండానే ఐదేళ్లపాటు పింఛన్‌ అందించారు. చంద్రబాబు కుట్రలు చేసి వలంటీర్లు నగదు తెచ్చి ఇవ్వకుండా అడ్డుకున్నాడు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మా గడప వద్దకే మళ్లీ పెన్షన్‌ చేర్చండి' అని పలువురు పింఛన్‌దారులు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని కోరారు. అనంతసాగరంలో బుధవారం ఉదయం ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి పలు కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు, దివ్యాంగులు ఎమ్మెల్యేతో మాట్లాడారు. ఎలాంటి కష్టం లేకుండా మాకు జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల ద్వారా పింఛన్లు అందించారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తేనే పెన్షన్‌ కష్టాలు తప్పుతాయని తెలిపారు. ఈ సందర్భంగా విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ రానున్నది జగనన్న సంక్షేమ ప్రభుత్వమేనని, లబ్ధిదారులు గడప దాటకుండానే పింఛన్‌తోపాటు సంక్షేమ పథకాలను అందజేస్తారని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్‌, జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి, సీనియర్‌ నాయకుడు ఉరిబిండి ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్‌ కన్వీనర్‌ అక్కలరెడ్డి అంకిరెడ్డి, సర్పంచ్‌ శోభ, బట్రెడ్డి జనార్దనరెడ్డి, సద్దా రవీంద్రారెడ్డి, వైస్‌ ఎంపీపీ అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం జగనన్న

• నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్‌ అహ్మద్‌



కరపత్రం అందజేస్తున్న ఖలీల్‌ అహ్మద్‌

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లపాటు పేదలకు అండగా నిలిచి సంక్షేమ పథకాలను అందించారని వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఎండీ ఖలీల్‌ అహ్మద్‌ తెలిపారు. నగరంలోని 4వ డివిజన్‌ న్యూకాలనీ, 47వ డివిజన్‌ గుప్తా పార్కు సెంటర్‌, కంసాలి వీధి, ములుముడి బస్టాండ్‌ సెంటర్‌, చిన్నబజారు మెయిన్‌రోడ్డు, 13వ డివిజన్‌ బాలాజీ నగర్‌ గ్యాస్‌ గోదాము సెంటర్‌, ఓల్డ్‌ బీఎస్‌ఎన్‌ఎల్‌ ఆఫీస్‌ రోడ్డు, గౌడ హాస్టల్‌ సెంటర్‌, వేపదొరువు, 43వ డివిజన్‌ జెండావీధి, బడేసాహెబ్‌వీధి, బొందిలివీధి తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నట్లు చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పోలంరెడ్డి లక్ష్మీప్రత్యూష, పొట్లూరి రామకృష్ణ ఆచారి, ఊటుకూరు నాగార్జున, జిల్లా వక్ఫ్‌ బోర్డు చైర్మన్‌ మీరామొహిద్దీన్‌, నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు, టీడీపీ ప్రచార సామగ్రి స్వాధీనం

ఆత్మకూరు: అనుమతి లేకుండా తెలుగుదేశం పార్టీ ప్రచార సామగ్రిని కారులో తరలిస్తుండగా బుధవారం మున్సిపల్‌ పరిధిలోని నెల్లూరుపాళెం సెంటర్‌ వద్ద పోలీసులు పట్టుకున్నారు. అందులోనే తెలంగాణకు చెందిన తొమ్మిది మద్యం బాటిళ్లను గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి. స్పెషల్‌ స్క్వాడ్‌, ఆత్మకూరు పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో ఓ కారును ఆపగా అందులో టీడీపీ ప్రచార సామగ్రి ఉంది. దీని తరలింపునకు అనుమతి పత్రాల్లేవు. అలాగే మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటిని తరలిస్తున్న ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.ముత్యాలరావు తెలిపారు.

12 మద్యం బాటిళ్లు

మనుబోలు: మండలంలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డు పోలీస్‌ చెక్‌పోస్టు వద్ద బుధవారం తనిఖీలు చేస్తుండగా తమిళనాడు ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు అక్రమంగా తరలిస్తున్న పుదుచ్చేరికి చెందిన 12 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని సెబ్‌ అధికారులకు అప్పగించి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

ఈఎంఆర్‌ఎస్‌లో ఇంటర్‌లో చేరికకు దరఖాస్తుల ఆహ్వానం

కొడవలూరు: మండలంలోని చంద్రశేఖరపురం ఏకలవ్య మోడల్‌ రెసిడెన్షియల్‌ కళాశాలలో సీబీఎస్‌ఈ ఇంటర్మీడియట్‌ మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్‌ టి.విష్ణుప్రియ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ గ్రూపులో బాలురకు 4, బైపీసీలో బాలురకు 11, హెచ్‌ఈపీలో బాలురకు 10, బాలికలకు 25 సీట్లు ఉన్నాయన్నారు. ఈనెల 18వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. యానాది, ఎరుకుల, నక్కల, సుగాలి తదితర గిరిజన కులాలకు చెందిన విద్యార్థులే అర్హులన్నారు. పదో తరగతి సీబీఎస్‌ఈ, స్టేట్‌ బోర్డు సిలబస్‌లో చదివి ఉండాలన్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలు, దివ్యాంగులకు మొత్తం సీట్లలో 10 శాతం రిజర్వేషన్‌ ఉంటుందని తెలిపారు. పదో తరగతిలో మార్కుల ఆధారంగా విద్యార్థులకు సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 90101 75322, 94909 57261 ఫోన్‌ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చిన్నారిపై లైంగికదాడికి యత్నం

నెల్లూరు(క్రైమ్‌): అభంశుభం తెలియని ఏడేళ్ల చిన్నారిపై గుర్తుతెలియని దుండగుడు లైంగికదాడికి యత్నించిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. కోటమిట్టలో ఓ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఏడేళ్ల కుమార్తె ఉంది. రెండు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తి చిన్నారిపై లైంగికదాడికి యత్నించాడు. బాలిక అతడి నుంచి తప్పించుకుని ఇంటికి వచ్చి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. వారు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బుధవారం రాత్రి నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి బాధిత తల్లిదండ్రులను విచారించారు. నిందితుడిని పట్టుకునేందుకు సీసీ టీవీ ఫుటేజ్‌ పరిశీలిస్తున్నారు.

కండలేరులో 7.014 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 7.014 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌ రెగ్యులేటర్‌ నుంచి సత్యసాయిగంగకు 220 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, లోలెవల్‌ కాలువకు 110 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పిడుగు పడి 40 గొర్రెల మృతి



మృతిచెందిన గొర్రెలు

సీతారామపురం: మండలంలోని పడమటి రొంపిదొడ్ల గ్రామంలో బుధవారం వేకువజామున పిడుగు పడి దుగ్గినబోయిన నాగేశ్వరరావు, గెట్టిబోయిన తిరుపతయ్య, కోడె సురేష్‌, రోశయ్య, కొండయ్య అనే వ్యక్తులకు చెందిన 40 గొర్రెలు మృతిచెందాయి. మంగళవారం వారు గొర్రెలు, వాటి పిల్లలను మేతకు తోలుకెళ్లారు. తిరిగి ఇంటికి తీసుకొచ్చే క్రమంలో రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో గొర్రెలను వేర్వేరు చోట్ల ఉంచారు. తెల్లవారేసరికి పిడుగుపడి అవి మృతిచెందినట్లు బాధితులు తెలిపారు.

'మా కుటుంబం బాగుపడింది.. మా బిడ్డలు ఇంగ్లిష్ మీడియం చదువుతున్నారు. మా అమ్మకు వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛన్ ఇస్తున్నాడు. రేషన్ బండి ఇంటికొచ్చి సరుకులు ఇస్తుంది. డాక్టర్లే ఇంటికి వచ్చి వైద్యం చేస్తున్నారు. వ్యవసాయాన్ని పండగ చేశారు. దశాబ్ద కాలం దగా పడిన మా బతుకులు ఈ ఐదేళ్లలో మళ్లీ చిగురించాయి. మాకు ఇంకేమి కావాలి. జగన్ అంటే.. ఒక నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం. పొరపాటున చంద్రబాబు వస్తే పథకాలన్నీ ఆగిపోతాయి.. మళ్లీ మా జీవితాలు చీకటి మయం అవుతాయి. ఊహించుకుంటునే వెన్నులో వణుకు పుడుతుంది. కలలో ఉలిక్కి పడుతున్నాం.. ఈ ఎన్నికల్లో మళ్లీ మా సంక్షేమ ప్రభుత్వాన్ని తెచ్చుకుంటామంటూ' ఓటరు ఘంటాపథంగా చెప్పుకొచ్చారు. గడిచిన 58 నెలల కాలంలో జిల్లాలో ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు 'సాక్షి' రోడ్ షో బృందం ప్రయత్నం చేసింది. అయితే ఎక్కడా తాము 'సాక్షి' టీమ్ అని కానీ, వైఎస్సార్‌సీపీకి సంబంధించిన వారమని చెప్పలేదు. గుంబనంగా ఉన్న ఓటరుతో మాటలు కలిపి మాట్లాడుతుంటే వారి మనస్సులోతుల్లో వైఎస్ జగన్‌పై ఉన్న ప్రేమను, మనోగతాన్ని వెల్లడించారు.

– సాక్షి ప్రతినిధి, నెల్లూరు



జగనంటే నమ్మకం

మళ్లీ మా సంక్షేమ ప్రభుత్వానికే ఓటు

- చంద్రబాబు అవకాశవాది
- ఆయనొస్తే.. పథకాలన్నీ ఆగిపోతాయి
- ఊహించుకుంటేనే వెన్నులో వణుకు
- సాక్షి రోడ్ షోలో తేల్చి చెప్పిన ఓటర్లు
- నెల్లూరు సిటీ, కోవూరు, కావలి నియోజకవర్గాల్లో రోడ్ షో

పిల్లలకు ఇంగ్లిష్ మీడియం సూపర్



ఉదయం 8.30 గంటల సమయం. నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని భగత్‌సింగ్‌కాలనీలో తొలుత షేక్ మస్తాన్ అనే యువకుడితో మాట్లాడాం. 'తాను ట్రాన్స్‌పోర్ట్ యజమానిగా ఉండడం వల్ల ట్యాక్స్ పేయర్‌గా కావడంతో ప్రభుత్వ పథకాలు ఏవీ రావని చెప్పాడు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని అందరూ చెబుతున్నారు. ముఖ్యంగా సీఎం జగన్ తీసుకొచ్చిన విద్యా విధానం సూపర్. ఇంగ్లిష్ మీడియంతో పిల్లల భవిష్యత్ మారుతుంది. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే గెలిస్తేనే ఇది సాధ్యమవుతుంది' అని తన మనోభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

– అక్కడికి కొద్ది దూరంలోనే మరో వ్యక్తి (పేరు వద్దన్నాడు)తో మాట్లాడాము. అతను మళ్లీ జగనే గెలవాలి అన్నాడు. ఎందుకు జగనే గెలవాలని అనుకుంటున్నావంటే.. ఈ ప్రభుత్వం అందరికి చాలా మంచి చేస్తోందన్నాడు. మీ ఇంట్లో మీకు ఏమైనా చేశాడా అంటే.. మా నాన్నకు పింఛన్ వస్తుంది.. నాకు ఇద్దరు కూతుర్లు ఒక పాపకు అమ్మఒడి వస్తుంది.. పిల్లకాయలు చదువుకునేందుకు అన్నీ ఇస్తున్నాడు.. వాళ్లు చదువుకుని బాగుపడుతారు.. ఇక నాకేం కావాలని ఎదురు ప్రశ్న వేశాడు.

బ్రాందీ షాపులు మూసేస్తే చాలు



సమయం ఉదయం 9.00 గంటలు. కోవూరు నియోజకవర్గం కోవూరు మండలం గంగవరం గ్రామానికి వెళ్లాం. రోడ్డు పక్కన బస్సు కోసం ఎదురుచూస్తున్న పులిమి విజయలక్ష్మి అనే మహిళతో మాట్లాడాం. 'జగన్ ప్రభుత్వం అందరికీ మంచి చేస్తోంది. మా ఆయనకు పింఛన్ వస్తుంది.. మేము కాపోళ్లం కదా.. రెండు దఫాలుగా పదిహేను వేలు వంతున వచ్చాయి. పిల్లలు చదువుకునేందుకు సాయం చేస్తున్నాడు. డబ్బులు వేయబట్టే కదా చదువుకుంటున్నారు.. వారు బాగుపడితే ఇంకే కావాలి. ఇప్పుడైతే బ్రాందీ షాపులు మూసేస్తే చాలు అంతకు మించి అవసరం లేదు. పనిపాటా చేసుకునే వాళ్లు.. సంపాదించిన ఐదొందల్లో సగానికి పైగా బ్రాందీకి తగలేస్తున్నారు. బ్రాందీ ఆపేస్తే ప్రభుత్వం కూడా నడడటం కష్టమే.. కానీ ఎంత కష్టమైనా ఆ పని చేయగలిగితే చాలు.. ఇప్పటికీ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని కోరుకుంటున్నాం' అని చెప్పుకొచ్చింది.

మాకు అన్నీ వస్తున్నాయి..



9.15 గంటలు. కోవూరు నియోజకవర్గం పాటూరు గ్రామానికి వెళ్లాం. తన కుటుంబ సభ్యులతో ఊరెళ్లేందుకు నిలబడి ఉన్న షేక్ బేగం అనే మహిళతో మాటలు కలిపాం. ఎన్నికలు జరుగుతున్నాయి కదా.. మళ్లీ ఎవరు గెలిస్తే బాగుంటుందని అనుకుంటున్నావని అడిగాం. 'మళ్లీ ఈ ప్రభుత్వం వస్తేనే మంచిది. ఎందుకు మంచిది.. నీకేమన్నా వస్తున్నాయా? నాకు వయస్సు లేదని పింఛన్ రావడం లేదు. మా ఆయనకు పింఛన్ వస్తుంది. పొదుపు ఆసరా, ప్రతి సంవత్సరం వడ్డీ డబ్బులు పడుతున్నాయని' చెప్పుకొచ్చింది.

పింఛన్ డబ్బులే మాకు ఆధారం



అక్కడి నుంచి కోవూరు నియోజకవర్గం కొడవలూరు మండలం తలమంచి అనే చిన్న గ్రామానికి వెళ్లాం. సమయం 9.45 గంటలు. అక్కడ మార్తమ్మ, వెంకటేశ్వర్లు అనే దంపతులను కలిశాం. భర్త వెంకటేశ్వర్లు పక్షవాతం పేషెంట్. భార్యాభర్తలు ఇద్దరూ ఏ పని చేయలేని స్థితి. మార్తమ్మతో మాటలు కలిపాం. 'మాకు నలుగురు పిల్లలు.. బతుకు దెరువుకు వేరే వేరే చోట ఉంటున్నారు. నా భర్తకు పింఛన్ వస్తుంది.. గవర్నమెంట్ ఆస్పత్రిలో మంచి డాక్టర్లు ఉన్నారు. డబ్బులు ఖర్చు లేకుండా మంచి మందులు ఇస్తున్నారు. మా ఊర్లో నెలకోసారి డాక్టర్లు మాకాడకే వచ్చి చూస్తున్నారు. ఆ డబ్బులతో పాటు నలుగురు బిడ్డలు ఇచ్చే అరకొర డబ్బులతో బతుకున్నాం. చాలా సంతోషంగా ఉన్నాం. మా ఎమ్మెల్యే కూడా బాగానే చేస్తున్నారు.' మళ్లీ ఈ ప్రభుత్వమే రావాలని చెప్పారు.

మాకు జగనే కావాలి.. చంద్రబాబు చెప్పినా చేయడు..

అక్కడి నుంచి కావలి నియోజకవర్గం బీరంగుంటలోని అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లాం. సమయం 10.15 గంటలు. అక్కడ అంగన్‌వాడీ సెంటర్ సిబ్బందితో పాటు మరి కొందరు మహిళలు ఉన్నారు. వారితో మాటలు కలిపాం. 'మాకు జగన్‌మోహన్‌రెడ్డి బాగా చేస్తున్నాడు.. ఇక్కడ అందరూ వైఎస్సార్‌సీపీనే. మేము చంద్రబాబు వస్తే సూపర్ సిక్స్ పథకాలంట.. జగన్‌మోహన్‌రెడ్డి కంటే ఎక్కువ ఇస్తామంటున్నారు.. మీరు ఎవరికి మద్దతు చెబుతారంటే.. మాకు జగనే కావాలి.. ఆయన చెప్పిన పథకాలనీ కచ్చితంగా మాకు వచ్చాయని చెప్పారు.. మొన్న ఈనాడులో జగన్ బటన్ నొక్కినా మీకు పథకాల డబ్బులు రాలేదని రాసింది.. నిజమేనా అంటే అదంతా పచ్చి అబద్ధం.. మాకు అటూ ఇటూగా పది రోజుల క్రితమే డబ్బులు మా అకౌంట్లో పడ్డాయని చెప్పారు. అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడితే.. చంద్రబాబు చెప్పినా చేయడు.. మేము నెల రోజులు సమ్మె చేస్తే.. మాకు ఆ నెల జీతం కూడా ఇచ్చాడంటూ చెప్పుకొచ్చారు. గతంలో చంద్రబాబు రెండు.. మూడు రోజులు స్ట్రైక్ చేసినా ఇవ్వలేదంటూ చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వంలో మాకు జీతాలు కూడా సక్రమంగా వచ్చేవి కాదు. ఇప్పుడైతే నెలనెలా వస్తున్నాయి. చంద్రబాబు ఉన్నప్పుడు పథకాలు వచ్చేవి కాదు.. ఇప్పుడు అన్ని వస్తున్నాయి. ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి మా అందరికి కూడా ప్రభుత్వ పథకాలు ఇస్తామని చెబుతున్నాడు' అని చెప్పుకొచ్చారు.

జగనన్న ఇచ్చిన డబ్బులతోనే కూరగాయల కొట్టు



ఉదయం 10.00 గంటలకు విడవలూరు మండలం చవటపాళెం అనే మరో చిన్న గ్రామానికి వెళ్లాం. చిన్నపాటి కూరగాయల దుకాణం నిర్వహిస్తున్న దక్కా పద్మావతి అనే మహిళతో మాటలు కలిపాం. 'మా ఊర్లో అటూ ఇటూ రెండు వైపులా ఉన్నారు అని చెప్పింది.. అలా కాదు.. ఎవరి వైపు మొగ్గు చూపుతున్నారని కొంచెం లోతుగా అడిగితే.. ఎక్కువగా వైసీపీ అంటున్నారు. మా ఊర్లో అందరికి అన్ని పథకాలు వచ్చాయి.. మాకు అయితే అమ్మఒడి, పొదుపు డబ్బులు వచ్చాయి. జగనన్న ఇచ్చిన ఇదిగో ఈ చిన్నపాటి కూరగాయల కొట్టుపెట్టుకున్నాం అని చెప్పింది.. ఈ సంవత్సరం జనవరిలో అమ్మఒడి డబ్బులు పడలేదని చెప్పగా, జూన్‌లో కదా ఇచ్చేది అంటే.. అవునంటా అని చెప్పింది.

బ్యాంక్ లోనుతోనే టిఫిన్ సెంటర్ పెట్టుకున్నా..



అక్కడి నుంచి 10.50 గంటలకు కావలి నియోజకవర్గంలోని అల్లూరు మండలం నార్త్ మోపూరులో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న జంపాని మమత అనే మహిళతో మాట్లాడాం. మొదట చెప్పడానికి కాస్త మోహమాటం పడినా.. ఆ తర్వాత 'మా పాపకు అమ్మఒడి డబ్బులొచ్చాయి.. మా ఆయనకు ఆటో డబ్బులు వచ్చాయి.. నాకు పొదుపు డబ్బులు, ఆసరా, చేయూత డబ్బులు వచ్చాయి, మా అత్తకు పింఛన్ వస్తోంది.. ఈ టిఫిన్ సెంటర్ కూడా జగనన్న ఇచ్చిన పొదుపు డబ్బులతో పాటు బ్యాంక్ లోనుతోనే పెట్టుకున్నాను. అందరికి అన్నీ అందుతున్నాయి.. అందరూ మళ్లీ ఈ ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నారు' అని చెప్పింది.

మా ఫస్ట్ ఓటు జగనన్నకే



11.20 గంటలకు అల్లూరు మండల కేంద్రంలో యువకులు చల్లా కార్తీక్, ఎస్‌కే అహ్మద్ సలీం, గుంటక వంశీతో మాటలు కలిపాం. మా అందరికి మొదటిసారిగా ఓటు వచ్చింది.. తొలి ఓటు జగనన్నకే వేయాలని ఎలక్షన్ రోజు కోసం ఎదురు చూస్తున్నాం అంటూ ఉత్సాహంగా చెప్పుకొచ్చారు. ఎందుకు వేయాలని అనుకుంటారని అంటే.. అందరికీ మేలు చేస్తున్నాడు.. చెప్పారు. అహ్మద్ సలీం మాట్లాడుతూ 'మా అవ్వకు పింఛన్ ఇస్తున్నారు. మా నాన్నమ్మకు చాలా ఖర్చయ్యే ఆపరేషన్‌ను ఆరోగ్యశ్రీ కింద డబ్బులు లేకుండా చేశారు. వచ్చేటప్పుడు ఖర్చులకు డబ్బులిచ్చారు. ఇంటి దగ్గరే రేషన్ సరుకులు ఇస్తున్నాడు. మా అమ్మకు పొదుపు డబ్బులు, ఆసరా, చేయూత డబ్బులు వచ్చాయి.' అని చెప్పాడు. మరో ఇద్దరు మాట్లాడుతూ మేము చదువుకున్న స్కూళ్లు డెవలప్ చేశారు. గోరుముద్దతో మంచి భోజనం పెడుతున్నారు. ఇప్పుడు మేము ఐటీఐ చదువుతున్నాం.. మాకు జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పడుతున్నాయి..అందుకే మళ్లీ జగనన్నే రావాలని కోరుకుంటున్నాం' అని చెప్పుకొచ్చారు.

ఇప్పుడున్న ధాన్యం ధరలను స్థిరీకరించాలి

అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో బోగోలు మండలం కోవూరుపల్లికి 1.50 గంటలకు చేరుకున్నాం. ఆ ఊర్లో రవీంద్రరెడ్డి, మోహన్‌రెడ్డితో పాటు కొందరు రైతులతో మాట్లాడాం. మేనిఫెస్టోలో రైతులకు గతంలో ఉన్నవే తప్ప కొత్తగా ఏమీ చెప్పలేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. రైతులకు రుణమాఫీ చేసింటే బాగుండేదన్నారు. అంతా కాకపోయినా.. లక్ష రూపాయలు మాఫీ చేసినా రైతులు సంతోషంగా ఉండేవాళ్లు. రుణమాఫీ చేయలేక పోయినా.. రైతు భరోసా అయినా చంద్రబాబు చెబుతున్న దానికంటే మరి కొంత ఎక్కువగా ఇచ్చి ఉంటే బాగుండేది. ఈ ఏడు ధాన్యం ధరలు చాలా బాగా ఉన్నాయి. ఇదే మాదిరిగా ఉన్నా.. చాలు. రుణమాఫీ చేయకపోయినా పర్వాలేదు. అయినా చంద్రబాబు మేనిఫెస్టోలో అయితే చెప్పినట్లు చేయడు. జగన్‌మోహన్‌రెడ్డికే వస్తారని చెప్పారు.

మా మత్స్యకారులు 90 శాతం వైఎస్సార్‌సీపీకే



తీరప్రాంతం మత్స్యకార గ్రామం ఇస్కపల్లికి చేరుకున్నాం. కొందరు మత్స్యకారులతో మాట్లాడాం. మత్స్యకారుడు శీనయ్యతో మాటలు కలిపాం.. గతంలో మేమందరం టీడీపీకి అనుకూలంగా ఉండేవాళ్లం.. జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక మాకు చాలా మంచి చేశాడు. మత్స్యకార భరోసా పెంచి ఇచ్చాడు. వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చనిపోతే రూ.10 లక్షలు ఇన్సురెన్స్ వచ్చేలా చేశాడు. డీజిల్‌కు సబ్సిడీ ఇస్తున్నాడు. మాకు కొంచెం పక్కనే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను పెట్టాడు. మా ఇళ్లల్లో ఆడోళ్లకు పథకాలు ఇస్తున్నాడు.. అందుకే అందరూ జగన్ అంటున్నారు. చంద్రబాబు పాలన గురించి అడిగినప్పుడు ఆయన గురించి చెప్పుకోవడానికి ఏమీ లేదు. మేము ఇప్పుడిప్పుడే బాగుపడుతున్నాం. మా మత్స్యకారులు 90 శాతం వైఎస్సార్‌సీపీకే చెబుతున్నారు. కొంత మంది టీడీపీకి అనుకూలంగా ఉన్నారు. వాళ్లకు కూడా పథకాలు వచ్చాయి. మనస్సాక్షి ఉంటే అందరూ వైఎస్సార్‌సీపీకే వస్తారు. మరి డబ్బులు పంచితే ఓట్లు వేస్తారని టీడీపీ వాళ్లు అనుకుంటున్నారంటే.. అదేమీ ఉండదు.

రైతులకు రుణమాఫీ చేస్తే బాగుండేది



12.25 గంటలకు అల్లూరు మండలంలోని సిద్ధగుంట గిరిజన కాలనీలో కొందరితో మాట్లాడాము. అక్కడ రైతులు, కూలీలు, ఇతరులు ఉన్నారు. రైతు యాటగిరి రమణతో మాటలు కలిపాం. అతని ధాన్యం కూడా కాటా వేస్తున్నారు. ధర ఎంత ఉంది.. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులు బాగున్నారా.. చంద్రబాబు పాలనో బాగున్నారా అని అడిగాం. ఇప్పుడైతే చాలా బాగుంది. మాకు రెండు పంటలు పండుతాయి. ఈ ఏడాది డ్యామ్‌లో నీళ్లు లేక ఒక పంట వేసుకున్నాం.. మంచి ధరలు ఉంటున్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టో ప్రకటించారు.. కదా అంటే రైతులకు రుణమాఫీ చేసి ఉంటే బాగుండేది. లేకుంటే రైతు భరోసా ఇచ్చే డబ్బులు మరి కొంచెం పెంచి ఉన్నా.. రైతులం బాగుపడేవాళ్లం. ఈ విషయాన్ని మరోసారి పరిశీలిస్తే బాగుంటుందని చెప్పాడు. మరో వ్యక్తితో మాట్లాడాం. ఈ ప్రభుత్వంలో మాకు చాలా పథకాలు వస్తున్నాయని చెప్పాడు. తన పిల్లలకు అమ్మ ఒడి, భార్యకు పొదుపు, ఇతర పథకాలు, మా అమ్మకు పింఛన్ వస్తుందని చెప్పాడు.

జనం బాగుపడుతున్నారు..

అక్కడి నుంచి ఫిషింగ్ హార్బర్ నిర్మితమవుతున్న జువ్వలదిన్నెకు 12.50 గంటలకు చేరుకున్నాం. అక్కడ కొందరు దుకాణదారులతో మాట్లాడాం. మాకైతే జగన్‌మోహన్‌రెడ్డి అన్ని ఇస్తున్నాడు. ఆయన్ను ఏ విధంగానే తప్పు పట్టలేం. ఫిషింగ్ హార్బర్ పూర్తయింది కదా అంటే ఇంకా ప్రారంభించలేదు.. అది వస్తే ఇక్కడ కొంత మందికి బతుకుదెరువు దొరుకుతుంది. ఒక మత్స్యకారుడు మాట్లాడుతూ జగనన్న చేస్తున్న అభివృద్ధితో మా ఊరు బాగుపడుతుంది.. మేము బాగుపడతాం. నేను ఒకప్పుడు చంద్రబాబు పార్టీనే. మాకు ఆయన పాలనలో ఏమీ చేయలేదు. మత్స్యకారులకు అయితే జగన్‌మోహన్‌రెడ్డి చేసినంత ఎవరూ చేయలేదు. మళ్లీ ఆయనే గెలుస్తాడు.. ఆయనే సీఎం అవుతాడు' అని చెప్పాడు. కొందరు యువకుడు అక్కడా బారా గట్టా ఆడుతున్నారు. వారితో మాటలు కలిపాం. ఇప్పుడు వేట లేదు ఖాళీగా ఆడుకుంటున్నామని చెప్పారు. మీ ఊర్లోనే ఫిషింగ్ హార్బర కడుతున్నారు.. కదా ఏదైనా ఉపయోగం ఉంటుందా అని అడిగితే.. ఎందుకు ఉండదు.. ఇప్పుడు మేమంతా బతుకుదెరువు కోసం ఏడాడకోపోతున్నాం.. మాకు హార్బర్ వస్తే ఇక్కడే పనిచేసుకుంటాం. కుటుంబంతో ఉంటాం కదా.. హార్బర్ అయిపోవచ్చింది.. ఎలక్షన్‌తో ఆగిపోయింది. ఎలక్షన్ తర్వాత రెడీ అవుతుంది.. జగన్ వస్తేనే హార్బర్ పూర్తవుతుంది.. ఆయన రాకపోతే మళ్లీ ఆగిపోతుందని' చెప్పారు.

మా భూమికి సర్వే చేసి పట్టా ఇచ్చాడు



1.25 గంటలకు ముంగమూరు గ్రామానికి వెళ్లాం. ఒట్టూరు కనకాద్రితో మాట్లాడాం. 99 శాతం వైఎస్సార్‌సీపీనే అంటున్నారు. ఎందుకంటే అందరికి మంచి జరిగిందంటున్నారు. మీకేం జరిగిందంటే.. మాకు రైతుభరోసా పడుతుంది. మా పిల్లాడికి అమ్మఒడి పడుతుంది. మా నాన్నకు పింఛన్ వస్తుంది. ప్రతి ఒక్కరికి అన్ని పథకాలు అందుతున్నాయి. నా మనటుకైతే.. నా పొలం అగ్రిమెంట్ల మీద ఉండేది. నలుగురు చేతులు మారినా ఇప్పటికీ అగ్రిమెంట్‌గా ఉండేది. మా ఊర్లో భూ సర్వే చేశారు. ఇప్పుడు నా పేరుతో పక్కాగా పట్టా వచ్చింది. అదే రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే.. 60.. 70 వేలు పెట్టుకోవాలి.. అది లేకుండానే జగన్ మాకు మంచి చేశాడు. వ్యవసాయం ఎలా ఉంది. ఈ ఏడు వర్షాలు తక్కువగా ఉన్నాయి. చెరువులో ఉన్న నీళ్లతో సేద్యం చేశాం. డ్యామ్‌లో నీళ్లు తక్కువగా ఉన్నాయి. పంట మధ్యలో ఉండగా నీళ్లు లేకపోతే మా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డే వెళ్లి అధికారులతో మాట్లాడి మా చెరువుకు నీళ్లు తెప్పించి ఇచ్చారు.

- ప్రతి గుండెలో జగనన్న గూడు కట్టుకున్నారు..
- రామాయపట్నంపోర్టు, జువ్వలదిన్నె హార్బర్‌తో తీరం సుసంపన్నం
- పారిశ్రామిక కారిడార్‌తో స్థానిక యువతకు వేల సంఖ్యలో ఉద్యోగాలు
- రానున్న ఐదేళ్లలో కావలి కనకపట్నం
- ప్రతిపక్షాలను ప్రజలు పట్టించుకోవడం మానేశారు

కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

ఇంటర్వ్యూ



ప్రజల తీర్పు.. ఫ్యాన్ వైపే

సంక్షేమ పథకాలతో వేల కుటుంబాలు బాగుపడ్డాయి

కావలి: జిల్లాలో కావలి రెండో జిల్లా కేంద్రమని అంటారు. విద్య, వ్యాపారాలకు కావలి కేంద్రంగా విరాజిల్లుతోంది. ప్రధానంగా వస్త్ర వ్యాపారంతో రెండో 'సూరత్'గా అభివర్ధిస్తుంటారు. సువిశాలమైన తీర ప్రాంతం కావలి సొంతం. పాడి, పంటను రెండు కళ్లుగా భావించే రైతులతో పాటు అత్యధికంగా ఉండే విద్యావంతులు, ఉద్యోగులు, వ్యాపారులు, విభిన్న భావజాలం కలిగిన వ్యక్తుల సమాహారం కావలి నియోజకవర్గంగా చెప్పొచ్చు. ఇక రాజకీయ కోణంలో ప్రజల తీర్పు చాలా విభిన్నంగా ఉంటుంది. స్వార్థంతో ఆలోచించే నేతలను మరోసారి గెలిపించిన దాఖలాలు ఇంత వరకు జరగలేదు. ప్రజల కోసం పాటుపడే రాజకీయ నేతలను గుండెల్లో పెట్టుకుంటారు. ప్రలోభాలకు, తాత్కాలిక ప్రయోజనాలకు తలొగ్గి ఓట్లు వేయరు. నాయకుడి గుణగణాలను, సామర్థ్యాలను అంచనావేసి, విజ్ఞతగా ఆలోచించి గెలిపించుకుంటారు. కావలిలో గెలుపోటములను అంచనా వేయడంలో సీనియర్ విశ్లేషకులు సైతం తడబడుతుంటారు. ఇంతటి విలక్షణమైన కావలి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వరుసగా రెండు సార్లు విజయం సాధించారు. మూడో సారి కూడా హ్యాట్రిక్ విజయం సాధించే దిశగా వైఎస్సార్‌సీపీ తరపున ఎన్నికల బరిలో నిలబడ్డారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారం, వ్యూహ ప్రతివ్యూహాలతో బిజీగా ఉన్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్రశ్న: కావలి ఎమ్మెల్యేగా 2014, 2019 ఎన్నికల్లో రెండుసార్లు ప్రజలు మిమ్మల్ని గెలిపించారు. 2024 ఎన్నికల్లో కూడా మిమ్మల్నే ఎందుకు గెలిపించాలి? ప్రజలు మార్పు కోరుకునే అవకాశం ఉంది కదా?

జవాబు: నేను పుట్టి పెరిగింది కావలిలోనే. నా వ్యక్తిత్వం, నా దక్షతను గుర్తించి 2014 ఎన్నికల్లో టీడీపీ ఎన్ని ప్రలోభాలు పెట్టినా ప్రజలు నన్నే గెలిపించారు. దురదృష్టవశాత్తు అప్పటి ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడంతో ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్నా.. ప్రజలకు ఆశించిన స్థాయిలో మంచి చేయలేకపోయాను. అయినా కూడా ప్రజల పక్షంగా ఉండి పోరాడిన నాపై నమ్మకంతో 2019 ఎన్నికల్లో మరో సారి మరింత మెజార్టీతో గెలిపించారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో కావలికి మంచి చేసే అవకాశం దక్కింది. ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్ సాధించగలిగాను. నియోజకవర్గంలోని యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించేలా పారిశ్రామిక కారిడార్‌కు ప్రతిపాదనలు చేయించగలిగాను. త్వరలో ఇవన్నీ సాకారం కానున్నాయి. ఐదేళ్లలో దాదాపు రూ.1,400 కోట్ల మేర 90 శాతం పైచిలుకు లబ్ధిదారులకు పథకాలు అందించగలిగాం. ఇవన్నీ ప్రజలు గమనించారు గనుకే మళ్లీ నన్ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారు.

ప్రశ్న: ఎమ్మెల్యేగా పదేళ్ల రాజకీయ జీవితంలో మీకు ఆత్మసంతృప్తి కలిగించిన, మీరు గర్వంగా చెప్పుకోగలిగిన అంశాలేవైనా ఉన్నాయా?

జవాబు: రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, పారిశ్రామిక కారిడార్ దిశగా అడుగులు వేయడం, కోవిడ్ సమయంలో ప్రజలకు అండగా నిలబడటం నాకు అత్యంత ఆత్మ సంతృప్తిని కలిగించింది. కోవిడ్ సమయంలో ప్రజల ప్రాణాలకు నష్టం వాటిల్లకుండా అధికారులను, డాక్టర్లను, ప్రజలను సమన్వయం చేయగలిగాం. ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా క్వారెంటయిన్ కేంద్రాలు, ఉచితంగా కోవిడ్ చికిత్సలు అందించే ఏర్పాట్లు చేశాం. ఏరియా ఆస్పత్రితో పాటు క్వారెంటయిన్ కేంద్రాల్లో కూడా ఆక్సిజన్ సిలిండర్లు, బెడ్లు అందుబాటులో ఉంచాం. కోవిడ్‌కు గురైన వారికి నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, చెన్నైలోని పెద్దపెద్ద ఆస్పత్రుల్లో చికిత్స అందించి వారి ప్రాణాలు కాపాడగలిగాను. ఈ క్రమంలో నేను మూడు సార్లు కోవిడ్ బారిన పడ్డాను. అందరి సహకారంతో కావలిలో కోవిడ్ కేసులు, మరణాలు సంఖ్యను తగ్గించగలిగాను.

ప్రశ్న: మీ గెలుపు కోసం పనిచేసిన కార్యకర్తలను విస్మరిస్తారని, ఇతర పార్టీల నేతలకు అధిక ప్రాధాన్యం ఇస్తారనే విమర్శ మీ క్యాడర్ నుంచి వినిపిస్తుంది?

జవాబు: మా పార్టీ కార్యకర్తలు, నాయకులను ఎప్పుడూ నిర్లక్ష్యం చేసే ఉద్దేశం కాదు. రాజకీయ కక్షలు, గొడవలు ఉండకూడదనే ఉద్దేశంతో వారిని కలుపుకు పోయేందుకు ప్రయత్నించాను. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలు అసంతృప్తికి గురైన మాట వాస్తవం. ఇతర పార్టీల నాయకులు వ్యక్తిగత ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇక ముందు ఇటువంటి పొరపాట్లు చేయకూడదని నిర్ణయించుకున్నాను. సొంత పార్టీ వారికి తప్ప ఇతర పార్టీలకు చెందిన వలసవాదులకు ఆస్కారం ఇవ్వదల్చుకోలేదు.

ప్రశ్న : మీపైన ఏడు కేసులు ఉన్నాయని టీడీపీ అభ్యర్థి పదేపదే ఆరోపణలు చేస్తున్నారు, ఏమిటా కేసులు?

జవాబు: నాపైన ఉన్న ఏడు కేసులు కూడా టీడీపీ ప్రభుత్వంలో ఉద్దేశపూర్వకంగా పెట్టిన కేసులే. 2014 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల తరఫున పోరాటం చేస్తున్నందుకు నాపైన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర ఆరు తప్పుడు కేసులు పెట్టించాడు. ఏడో కేసు 2019 ఎన్నికల సమయంలో గీతా మందిరంలో దర్శనానికి వెళితే నాతో పాటు వచ్చిన కార్యకర్త ఒకరు మెడలో పార్టీ కండువాతో వచ్చారు. ఆలయంలో ఎన్నికల ప్రచారం చేస్తున్నానని రవిచంద్ర మరో తప్పుడు కేసు పెట్టించాడు. ఇవన్నీ కూడా తప్పుడు కేసులే తప్ప నాపైన ఎటువంటి అవినీతి ఆరోపణలు, మోసాలకు సంబంధించిన కేసులు లేవు. నేను వ్యక్తిగత లబ్ధి కోసమో, స్వలాభం కోస మో తప్పు చేసినట్లుగా ఒక్క కేసు కూడా నాపైన లేదు. అసలు నా వ్యక్తిత్వమే అటువంటిది కాదు.

ప్రశ్న: టీడీపీ అభ్యర్థి పదేపదే మీపైన వ్యక్తిగత ఆరోపణలు, విమర్శలు చేస్తూ కవ్వింపు చర్యలకు దిగుతున్నాడు. పార్టీలో చేరికలంటూ మీకు ఛాలెంజ్ విసిరేలా రెచ్చగొట్టే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. అయినా మీరెందుకు మౌనంగా ఉంటున్నారు?

జవాబు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి జరగని స్థాయిలో కావలికి మేలు జరిగింది. ఏ గ్రామానికి వెళ్లినా ఫ్యాన్ గాలి బలంగా వీస్తుంది. టీడీపీకి ఘోర ఓటమి తప్పదు. దీంతో టీడీపీ అభ్యర్థి పదేపదే కవ్వింపు చర్యలకు, రెచ్చగొట్టే వ్యాఖ్యల చేస్తున్నాడు. వీటికి స్పందిస్తే గ్రామాల్లో ఇరువర్గాల మధ్య గొడవలు జరగడం తప్ప ఎటువంటి ప్రయోజనం ఉండదు. ప్రజాతీర్పు స్పష్టంగా ఉన్నప్పుడు అనవసర విషయాలతో ప్రజల ప్రశాంతతను చెడగొట్టడం ఎందుకనే ఉద్దేశంతో వారి మాటలు పట్టించుకోవడం లేదు. టీడీపీలో చేరికలు అనేది పెద్ద నాటకం. నియోజకవర్గంలో టీడీపీ ఎప్పుడో తుడిచి పెట్టుకుపోయింది. ఉదయగిరి, నెల్లూరుకు చెందిన వాళ్లను తీసుకువచ్చి కండువాలు కప్పి సోషల్ మీడియాలో షో చేస్తున్నారు.

ప్రశ్న: కావలిని నిర్లక్ష్యం చేశారని, తుమ్మలపెంటరోడ్డు, ఫ్లైఓవర్ పూర్తి చేయలేదనే విమర్శలు ఉన్నాయి.

జవాబు: అభివృద్ధి అనేది ఒక దీర్ఘకాలిక ప్రక్రియ. ఒకటి, రెండు పనులు చేసి చేతులు దులుపుకునేది కాదు. కావలిని కనకపట్నంగా మార్చాలనే లక్ష్యంతో సమున్నతమైన ప్రణాళికలు, ప్రతిపాదనలు రూపొందించడం జరిగింది. తుమ్మలపెంట రోడ్ విస్తరణలో కాంట్రాక్టర్ ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేశారు. అతనిపై చర్యలకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కలుగోళమ్మ ఫ్లైఓవర్ నిర్మాణంలో కూడా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఉంది. ఆ టెండర్ రద్దు చేసి మళ్లీ కొత్త టెండర్లు పిలవడంలో చాలా సమస్యలు, న్యాయపరమైన చిక్కులు ఉన్నాయి. అయినా కూడా వీటిని అధిగమించి పూర్తి చేసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం. నగరంగా మారబోయే కావలిని అదే స్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ట్రంక్‌రోడ్డు విస్తరణ, రింగ్‌రోడ్డు, వ్యాపార కూడళ్లు, మార్కెట్ సముదాయాలు, పట్టణ సుందరీకరణ, ఇలా ప్రణాళికలు ఉన్నాయి.

ప్రశ్న: మీ ప్రత్యర్థి కావ్య కృష్ణారెడ్డి ఉదయగిరి నుంచి కావలికి వచ్చి మీపై పోటీ చేసేందుకు ఏమైనా ప్రత్యేక కారణం ఉందా?

జవాబు: పోర్టు, హార్బర్, పారిశ్రామిక కారిడార్, దామవరం విమానాశ్రయంతో కనకపట్నంగా మారబోతున్న కావలి నియోజకవర్గాన్ని కబళించడమే కావ్య కృష్ణారెడ్డి లక్ష్యం. అందుకోసమే డబ్బు సంచులతో టీడీపీ టికెట్ తెచ్చుకున్నాడు. నేరస్తులను, రౌడీషీటర్లతో అనుచర వర్గం ఏర్పాటు చేసుకుని పట్టణ వ్యాపారులను కూడా పార్టీ మారాలని బెదిరింపులకు గురి చేస్తున్నాడు. కబ్జాలు, రౌడీయిజమే కావ్య అజెండా. అన్నవరంలో 150 ఎకరాల క్వారీని ఆక్రమించి 200 అడుగుల లోతు వరకు కంకర తవ్వేశాడు. సుమారు రూ.400 కోట్లు ఈ ఒక్క క్వారీలోనే అక్రమంగా సంపాదించాడు. కావలి రైల్వే ట్రాక్ పక్కన లేఅవుట్ వేసి డబుల్ రిజిస్ట్రేషన్లతో జనాలను మోసం చేశాడు. సూళ్లూరుపేటలో 15 ఎకరాల్లో నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ వేసి అమ్మేయడంతో కొనుగోలు చేసిన మధ్య తరగతి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కావ్య కృష్ణారెడ్డి గతంలో టీచర్‌గా పనిచేసే సమయంలో గొర్రెల పెంపకం పేరుతో జనాల నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేయడంతో జైలుకు కూడా వెళ్లి వచ్చాడు.

ప్రశ్న: పోలింగ్‌కు మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉంది. కావలి భవితవ్యం నిర్ణయించే నియోజకవర్గ ప్రజలకు మీరు ఏం చెప్పాలనుకుంటున్నారు?

జవాబు: కావలి నియోజకవర్గానికి ఈ ఎన్నికలు చాలా కీలకం. కావలి అభివృద్ధి కోసం గత ఐదేళ్లుగా పడిన శ్రమ అంతా ఇప్పుడు సాకారం కాబోతుంది. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్ ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. వీటికి అనుబంధ పరిశ్రమలు, దామవరం ఎయిర్‌పోర్టు, పారిశ్రామిక కారిడార్‌తో యువతకు భారీగా ఉద్యోగాలు లభించనున్నాయి. రైతుల కోసం సాగునీటి కాలువల ఆధునికీకరణ, కావలి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పట్టణంలో ట్రంక్‌రోడ్డు విస్తరణ, రింగ్‌రోడ్డు ఏర్పాటు, పట్టణ సుందరీకరణ, తదితర పనులన్నీ రానున్న ఐదేళ్లల్లో పూర్తి కానున్నాయి. ఇవన్నీ జరగాలంటే వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావాలి. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటేసి కావలి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా నన్ను, ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. మేం కావలి ప్రగతికి కట్టుబడి ఉంటాం.